క్లుప్తంగా

వినాయకుని సేవలో సీనియర్ న్యాయవాది



న్యాయవాదికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం జమ్మూ,కశ్మీర్ హైకోర్టు సీనియర్ న్యాయవాది, లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ తష్టి రబస్తాన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిమ్మోజుపల్లెలో ఆరోగ్య సురక్ష-2

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్నం సచివాలయంలో..

తవణంపల్లె: మండలంలోని పట్నం సచివాలయంలో మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



గుడిపాల: వైద్య సేవలందిస్తున్న అనూష

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని 104 వైద్యాధికారి అనూష అన్నారు. 197రామాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ గతంలో వైద్యం కోసం మండల కేంద్రాలకు రావాల్సి ఉండేది. ప్రస్తుతం గ్రామంలోకి డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. అనంతరం షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాంతకుమారి, దివ్య, శిల్ప, సరస్వతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 10 మంది ఎంపిక



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 20 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 35 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 10 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలు మృతి



స్వరూపరాణి(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని చిల్లగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఆదివారం రాత్రి హఠాన్మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిత్తూరులోని నివాసంలోనే స్వరూపరాణి(59) అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొంది తిరిగివచ్చారు. ఇంటికి చేరుకున్న కొంత సేపటికి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈమె గత ఏడాది జూన్‌లో చిల్లగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఉపాధ్యాయురాలి మృతిపై సోమవారం ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబు, ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

శీతాకాలం.. పశువులు భద్రం!

- వ్యాధుల నివారణకు జాగ్రత్తలు
- ఎండ తగిలేలా పాకలు ఉండాలి
- ఏడీ పద్మావతి సూచనలు

ఐరాల: శీతాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండడంతో పశుసంరక్షణకు తగిన జాగ్రత్తలు తప్పనిసరి. కొత్త గడ్డిని మేత మేసే పశువులు, గొర్రెలు, మేకలు బలహీనంగా తయారవుతాయి. సకాలంలో తగిన వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల నుంచి పశువుల సంరక్షణకు సంబంధించి పాడి రైతులకు పలు సూచనలు చేశారు.

గురక లేక గొంతువాపు

పశువుల్లో గురక లేక గొంతువాపు వ్యాధి బ్యాక్టీరియా/సూక్ష్మజీవి కారణంగా వస్తుంది. పశువులకు గడ్డం కింద వాపు, కళ్లు ఎర్రపడటం, ముక్కు నుంచి తీగలు కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయి. ఈ వ్యాధి నివారణకు సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు మందులు వాడాలి. ముందస్తు టీకాలు వేయించి అరికట్టవచ్చు.

గాలికుంటు వ్యాధి

పికార్నో వైరస్‌తో పశువుల్లో గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. గిట్టలు ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడిన పశువులు నడవలేకపోతాయి.



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యుడు పినాకాపాణి (ఫైల్)

> **తిరుగుడు రోగం**
>
> రక్తంలోని ట్రిపనోజోమా పరాన్న జీవుల కారణంగా పశువుల్లో తిరుగుడు రోగం సంక్రమిస్తుంది. ఇది అన్ని రకాల పశువులకు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు బెరేనిల్, ట్రిక్విన్, పెరిటాస్ మందులు వాడాలి.

దీని నివారణకు గాలికుంటు టీకాలు ఆరు నెలలకోసారి వేయాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. గిట్టల మధ్యలోని పుండ్లను పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. బీస్ప్రేపెన్ మందు 2.5 గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50ఎంఎల్ మందులు వాడటంతో పాటు వేప నూనె రాయడం వల్ల ఫలితం ఉంటుంది.



ఆవుకు వైద్యం చేస్తున్న ఏడీ పద్మావతి (ఫైల్)

సాధారణ చిట్కాలు

కాలానికి తగిన విధంగా ఆహారం, నీటిని అందిస్తూ పరిశుభ్ర వాతావరణంలో పశువులను ఉంచాలి. శీతాకాలం ప్రారంభం నుంచే అధిక చలి నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి. పశువులకు దాణాను కాస్త ఆలస్యంగా ఇవ్వాలి. నట్టల నివారణకు మందులు ముందస్తుగా తాగించాలి. ఎఫ్ఎండీ, హెచ్ఎస్, బీక్యూ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువుల పాకల్లో సూర్యరశ్మి పడేలా చూసుకోవాలి. మండలంలో ఆవులు 19,907, గేదెలు 50, గొర్రెలు 10,400, మేకలు 4,418 ఉన్నాయి.

> **ముందస్తు జాగ్రత్తలతో సంరక్షణ**
>
> 
>
> పశువుల పెంపకంలో ముందస్తు చర్యలు చేపట్టడంతోనే సంరక్షణ సాధ్యమవుతుంది. వేసవి కాలం నుంచే పశువులకు టీకాలు వేయించాలి. మేలైన యాజమాన్య పద్ధతులు పశుపోషణ విషయంలో శ్రద్ధ తీసుకోవడం ద్వారా శీతాకాలంలో పశువులకు రక్షించుకోవచ్చు. పశు వైద్యుల సలహాల మేరకే మందులు వాడాలి. పాడి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
>
> – పద్మావతి, పశుసంవర్ధక శాఖ ఏడీ, ఐరాల

పేదల ఆరోగ్యానికి భరోసా



వైద్యసేవలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకల-1లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రోజంతా వీడని ముసురుతో అగచాట్లు





బంగారుపాళెంలో కురుస్తున్న చిరుజల్లులు, వర్షంలోనే గొడుగులు చేతపట్టుకుని పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో సోమవారం వేకువజామున ముసురుతో ప్రారంభమై జోరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు మోస్తరు స్థాయిలో వర్షం పడింది. మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఈ వర్ష ప్రభావానికి నగమంతా అక్కడక్కడ జలమయంగా మారింది. సాయంత్రం వరకు కూడా వర్షం వీడలేదు. దీంతో చలి తీవ్రత పెరిగింది.

అవస్థల్లో జనం

బంగారుపాళెం: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం కారణంగా మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి మండలంలో చిరుజల్లులతో కూడిన ముసురు మొదలైంది. ఉదయం నుంచే జనం రోజువారీ కార్యకలాపాలకు అడ్డంకిగా మారింది. భవన నిర్మాణ కూలీలు, వ్యవసాయ కూలీలు, రహదారి పక్కన తోపుడు బండ్లు, కూరగాయలు విక్రయించుకునే చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పనులకు వెళ్లకుండా ఇంటికే పరిమితం అయ్యారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లుల జడివాన పడుతూనే ఉన్నాయి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల ప్రజలు ఇంటి పట్టునే ఉండాల్సి వచ్చింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దుష్ప్రచారం

పూతలపట్టు: ఎన్టీఆర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు ప్రచారాన్ని వారు ఖండించారు. మండలంలోని ఎగువపాలకూరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త గణేష్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం స్థానికి ఎన్టీఆర్ విగ్రహ శిలాఫలకాన్ని దుండగులు పాక్షికంగా పగలకొడితే ఎల్లో మీడియాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధ్వంసం చేసినట్లు తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. టీడీపీ నేత గుర్రప్పస్వామి ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై నిందలు మోపుతున్నారని చెప్పారు. ఇలాంటి నీచమైన పనులు చేసేది టీడీపీ శ్రేణులేనని, తమకు ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం కానీ, చేసే ఉద్దేశం కానీ లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి, ఓర్వలేని టీడీపీ నాయకులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామానికి రోడ్లు, ఇండ్లు, నూతన పింఛన్లు, విద్యాదీవెనలు వంటివి మరెన్నో పథకాలతో ఒక్కో కుటుంబం రూ.3 లక్షలకు పైగా లబ్ధిపొందారని చెప్పారు. ఇది టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులే, వారి అనుచరులతో శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ఉండవచ్చని అనుమానించారు. తమకు వైఎస్సార్‌తో పాటు ఎన్టీఆర్ అంటే కూడా అభిమానం, గౌరవం ఉందని తెలిపారు. తప్పుడు ప్రచారాలు, నీచమైన రాజకీయాలు పచ్చనేతలకే అలవాటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, జయపాల్, హరిప్రసాద్, కుప్పయ్య, అన్నాస్వామి, ఎగువపాలకూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గణేష్

రక్తహీనత నివారణకు చర్యలు



పల్లెచెరువులో వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక



గోవిందరెడ్డిపల్లెలో గర్భవతులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని పల్లెచెరువు, గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు నిర్వహించారు. పల్లెచెరువులో వైద్యాధికారి ప్రియాంక, గోవిందరెడ్డిపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, సుధీర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, మౌనిక, జమున, శ్రీనివాసులు ఆశా కార్యకర్తలు శ్రీదేవి, భువనేశ్వరి, జమున, భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు సదస్సు

తవణంపల్లె: మండలంలోని అరగొండ- గాజులపల్లె రోడ్డులో ఈశ్వరుని గుడిలోని గౌరీశంకర కల్యాణ మండపంలో మంగళవారం మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యాన అధికారి సాగరిక తెలిపారు. సదస్సుకు జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి హాజరై రైతులకు సూచనలు, సలహాలివ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్పందన వినతులు సకాలంలో పరిష్కరించండి



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. సమస్యలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం -4, పట్టణ ప్రణాళిక విభాగం -1 చొప్పున మొత్తం 5 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



బీరప్పచెరువు పాఠశాలలో ముందుస్తు భోగి మంటలను వేస్తున్న హెచ్ఎం, విద్యార్థులు

ఐరాల: విద్యార్థులకు ఆటల ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని బీరప్పచెరువు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ఉషారాణి అన్నారు. మండలంలోని బీరప్పచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బీరప్పచెరువు యువత రంగనాథ్, రాజశేఖర్, రుక్మాంగధ, భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఎం పాఠశాల ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో రంగు రంగుల ముగ్గులు వేసి, భోగి మంటలు వేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. హెచ్ఎం మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు మన పండుగలు, సంప్రదాయాలు తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు నిర్విరామ కృషి

పుత్తూరు: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నిర్విరామంగా కృషి చేయాలని కాలిఫోర్నియా సిలికానాంధ్ర యూనివర్సిటీ అధ్యక్షుడు సి.బాలచంద్రరాజు కోరారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సరేంద్ర రచించిన భావ తరంగాలు, అడవిమల్లి కవితా సంపుటిని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. విదేశాలకు వెళ్లినా మాతృభాషపై మక్కువ తగ్గలేదని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం పలు దేశాల్లో సిలికానాంధ్ర మనబడి యూనివర్సిటీ సేవలు అందిస్తోందని వివరించారు. పలు దేశాల్లో ఎన్ఆర్ఐలు తమ పిల్లలకు తెలుగు భాష నేర్పించడానికి ఇష్టపడుతున్నట్లు తెలిపారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం బాలచంద్రరాజును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ బాలచంద్రరాజు

108లో సుఖ ప్రసవం

గంగాధర నెల్లూరు : మహిళ 108లో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని ఒగ్గువారిపల్లికి చెందిన శైలజకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది అశ్విక ప్రసవం చేశారు. ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, బిడ్డను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు 108 సిబ్బంది ఈఎన్‌టీ అశ్విక, పైలెట్ చిట్టిబాబు సూపర్‌వైజర్ మోహన్‌బాబును అభినందించారు.



శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

నగరంలో పారిశుధ్య పనుల తనిఖీ

చిత్తూరు అర్బన్: నగరంలో మార్కెట్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కగా చేపట్టాలని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో, సోమవారం ఉదయం నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కొంగారెడ్డిపల్లి, చర్చి వీధిలోని కూరగాయల మార్కెట్లు, ఫిష్ మార్కెట్లను తనిఖీ చేశారు. స్థానిక దుకాణదారులతో మాట్లాడారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో దుకాణదారులు, వ్యాపారులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా చెత్త తరలించే వాహనాలకు అందించాలని సూచించారు. మార్కెట్ల వద్ద, ప్రధాన సర్కిల్స్, రద్దీ ప్రాంతాల్లో రోజూ చెత్తను తరలించాలని చెప్పారు. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని సమకూర్చుకొని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు మెరుగ్గా చేపట్టాలన్నారు. ఎక్కువ వ్యర్థాలను ఉత్పత్తి చేసే హోటల్స్, మాల్స్, ఇతర సంస్థలను సమన్వయం చేసుకొని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడ డ్రైనేజీ బ్లాక్ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.



పారిశుధ్య చర్యలో భాగంగా దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై చర్చాపోటీలు

తిరుపతి సిటీ : విజయవాడలో 125 అడుగుల ఎత్తు ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్, డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో సోమవారం విద్యార్థులకు చర్చా పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాంపిటీషన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అధ్యాపకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ప్రొఫెసర్ జె.కాత్యాయని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.విద్యావతి, డాక్టర్ టి.శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవి విద్యార్థులు పాల్గొన్నారు.



చర్చలో పాల్గొన్న విద్యార్థులు